క్లుప్తంగా

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ రాబర్ట్ కెన్నెడి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న చిన్న విషయాలకే ఆందోళన చెందుతూ విద్యార్థులు ఆత్మహత్యల దారిలో నడవకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించారు. ఒత్తిడిని తట్టుకోవడానికి యోగా, ధ్యానం అలవర్చుకోవడం, ఆలోచనలు–అభిప్రాయాలను సహ విద్యార్థులతో పంచుకోవడం అవసరమని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, కృష్ణశాంక, అన్నపూర్ణ, లక్ష్మిదేవి, రమణారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, సంటిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

అవుకు(కొలిమిగుండ్ల): మండలంలోని ఉప్పులపాడు, కునుకుంట్ల గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను శుక్రవారం డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఏ–1 పరీక్షలకు చెందిన అసెస్‌మెంట్‌ను పరిశీలించారు. విద్యార్థుల హాజరుతో పాటు పాఠశాల పరిసరాలను తనిఖీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరం


ఆకుమల్లలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న మహేష్

సంజామల: సమాజంలో ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ మహేష్ సూచించారు. మండలంలోని ఆకుమల్ల గ్రామంలో పొదుపు మహిళలకు సైబర్ నేరాలు, బ్యాంక్ సేవలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు సరైన పద్ధతిలో వినియోగం కావడంలేదని పేర్కొన్నారు. బ్యాంక్ సేవలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే ఆర్థికంగా మెరుగుపడే అవకాశం ఉంటుందని చెప్పారు. అయితే సరైన అవగాహన లేకుండా డిజిటల్ సేవలను వినియోగిస్తే సైబర్ నేరాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. అలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ నాయక్, కంబగిరి పాల్గొన్నారు.

నేడు వెంకటాపురం చెరువుకు జలహారతి

డోన్ టౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతి పెద్ద చెరువుల్లో ఒకటైన వెంకటాపురం తుమ్మల చెరువులో (పల్లె చెరువు) శ్రావణ బహుల అమావాస్య సందర్భంగా శనివారం జలహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీవేదమాత బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు క్లై శేషావలి శర్మ తెలిపారు. రైతుల క్షేమం కోసం జరుపుతున్న గంగాహారతి కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. బ్రాహ్మణ కుటుంబ సభ్యులు సపరివార సమేతంగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమానికి వచ్చే వారు ఉదయం 9 గంటలలోపు స్థానిక గాయత్రి పీఠంకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నగదు బహుమతులు


నగదు పంపిణీ చేస్తున్న దాతలు

బనగానపల్లె : మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి ఆర్థిక ప్రోత్సాహం అందించారు. వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరుకు చెందిన కె. సుబ్రహ్మణ్యం ఆచారి సహకారంతో జేకేఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల హెచ్ఎం గౌరిశకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని పంపిణీ చేశారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలకు చెందిన వెంకటభవ్య 578 మార్కులు, సుస్మిత 529, ఉదయవాని 479, దూదేకుల రేష్మా 432 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పరమేశ్వరుడు, నందప్ప, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం



ఎంపీపీ, ఉర్దూ పాఠశాలల సమీపంలో నీటి మడుగులను తలపిస్తున్న రోడ్డు, గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా చిత్తడిగా మారిన రోడ్డు

బనగానపల్లె రూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ పలుకూరు ప్రధాన రహదారి దారుణ స్థితిలో ఉండడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పంచాయతీ కార్యాలయం, ఈద్గా వరకు వెళ్లే రోడ్డు అంతా గుంతలతో నిండిపోయి ప్రమాదకరంగా మారింది. మైనింగ్ ప్రాంతం కావడంతో తరచుగా ట్రాక్టర్లు, టిప్పర్లు రాకపోకలు ఎక్కువగా ఉండటంతో రహదారి పూర్తిగా ధ్వంసమైపోయింది. ఒకటి నుంచి రెండు అడుగుల మేర గుంతలు ఏర్పడడంతో వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ చేరి వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది.

విద్యార్థుల అవస్థలు

ఈ రహదారిపై ప్రభుత్వ ఎంపీపీ పాఠశాల, ఉర్దూ ఎంపీపీ పాఠశాలతో పాటు మరో రెండు ప్రైవేట్ పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు ప్రతిరోజూ భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు. ప్రత్యేకించి చిన్నపాటి వర్షం పడినా గుంతల్లో నీరు నిలిచి విద్యార్థులకు, గ్రామ ప్రజలకు నరకయాతన తప్పడంలేదు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రహదారి ఇంత దారుణంగా ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ ఆదాయం ఎక్కువగా వస్తున్నా అభివృద్ధి పనులపై అధికారులు చులకనగా చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈద్గాకు వెళ్లే రహదారి కూడా ఇదే కావడంతో ముస్లింలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులను వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.


బస్సు సౌకర్యం లేక ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

బస్సు సౌకర్యం లేక అవస్థలు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు రామిరెడ్డిపల్లె గ్రామ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి దాదాపు 10 ఏళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ మూడు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు చేరుకోవాల్సి వస్తోంది. రామిరెడ్డిపల్లె నుంచి సుమారు 70 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి బాడుగ ఆటోలపై ఆధారపడుతున్నారు. అయితే ఆటోలు సమయానికి రాకపోతే నడక తప్పడం లేదు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను బైక్‌లపై పంపిస్తుండగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలు వర్షం, ఎండలలోనూ నడుచుకునిపోతే తప్ప మరో మార్గం లేదు. ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఇప్పటివరకు బస్సులు నడపలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పేరుసోముల– రామిరెడ్డిపల్లె మార్గంలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

సార్.. ఆర్టీసీ బస్సు నడపండి



పేరుసోముల నుంచి రామిరెడ్డిపల్లెకు ఆర్టీసీ బస్సు నడపండి సార్. వర్షాకాలంలో ఆటోలో వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. ప్రతిరోజు చార్జీ పెట్టుకుని ఆటోలో వెళ్లాలి. సమయానికి పాఠశాలకు వెళ్లలేకపోతున్నాం. ఆటోలు రాని సమయంలో నడుచుకుని వెళ్తున్నాం. మా పక్క ఊరికి విద్యార్థి బస్సు వెళ్తుంది. మా ఊరికి రావడం లేదు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.
–శివర్ధన్, 7వ తరగతి విద్యార్థి, రామిరెడ్డిపల్లె

ఘనంగా గ్రామోత్సవం



మెట్టుపల్లిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, అవుకులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత భక్తులు

ప్యాపిలి: మెట్టుపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం శ్రీకృష్ణుని ప్రతిమకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామోత్సవంలో గ్రామస్తులు, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు కృష్ణ, మల్లేశ్వరయ్య, శివకృష్ణ, మదనకృష్ణ, నాగరాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అవుకు(కొలిమిగుండ్ల): శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అవుకు పట్టణంలో గోపాలుడి గ్రామోత్సవం నిర్వహించారు. వారం పాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు స్వామి ప్రతిమను పూలతో అందంగా అలంకరించి మేళతాళాల మధ్య పట్టణ వీధుల్లో ఊరేగించారు. అలాగే కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లెలో శనివారం శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలకు హాజరుకావాలని కోరారు.

వైభవంగా తిరుచ్చి మహోత్సవం


పల్లకీపై విహరిస్తున్న మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం రాత్రి తిరుచ్చి మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో డోలు వాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ కనుల విందుగా ఊరేగింపు చేశారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు


మెడల్ అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

డోన్ టౌన్: విధి నిర్వాహణలో అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపుతో పాటు సత్కారాలు లభిస్తాయని డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏ. మాదన్నకు భారత ప్రభుత్వం అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని ప్రకటించగా, శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మాదన్న 25 ఏళ్లుగా విశిష్టమైన సేవలు అందించారని, ఆయన నిజాయితీ, నిబద్ధత, అంకితభావానికి గుర్తింపుగానే ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. ఈ గౌరవం పోలీసు శాఖకే గర్వకారణమని అన్నారు. యువ పోలీసు సిబ్బందికి ఆయన సేవలు ఆదర్శమని, అందరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్, నాగరాజు, ఏఎస్ఐ భాస్కర్, వెంకటరమణ పాల్గొన్నారు.

తమలపాకులతో అలంకరణ


తమలపాకుల అలంకరణలో కన్యకాపరమేశ్వరి

అవుకు(కొలిమిగుండ్ల): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో అమ్మవారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాతకు కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన, తదితర విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

డోన్ టౌన్: శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాతను 108 కిలోల పసుపు కొమ్ములు, 108 చీరలతో ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం కుంకుమార్చన, మహా మంగళహారతులు, తీర్థప్రసాదం వితరణతో పాటు లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పూజలకు అవసరమైన వస్తువులను దిండు కుర్తి లక్ష్మీరంగనాథ గుప్తా, పద్మ దంపతులు సమకూర్చారు. ఆర్యవైశ్య సంఘీయులు, ఆవోపా సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రతిభ చాటిన విద్యార్థినులతో అధ్యాపకులు

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఏ. అనిత, షాహినా పర్వీన్ జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజిక సత్యప్రపూర్ణ తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖ–ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ద్వితీయ సంవత్సరం బైపీసీకి చెందిన అనిత, ద్వితీయ సంవత్సరం ఎంపీసీకి చెందిన షాహినా పర్వీన్ పాల్గొని విశేష ప్రతిభ చూపారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు రూ.5 వేలు నగదు బహుమతిగా అందజేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన ఈ విద్యార్థినులు ఈ నెల 26న విజయవాడలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యువతలో హెచ్ఐవీ, డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు భాగంగా నిర్వహించే యూత్ ఫెస్ట్–2025 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినులను అభినందించారు.

నివాళి


సంతాపం తెలుపుతున్న ఎంపీపీ

బేతంచెర్ల: శేషారెడ్డి నగర్ కాలనీలో నివసిస్తున్న ముఫ్తి అజ్మతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ సుభాన్ తండ్రి హుసేన్ మియ్యా (86) అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాన్ని సందర్శించిన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ,మండల కన్వీనర్లు తిరుమలేష్, పిట్టల జాకీర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వలీబాషా, మనోహర్‌నాయుడు, అల్తాఫ్, ఖాజా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వేడుకగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో అలంకరించి ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పెద్దరాజుస్వామిని దర్శించుకున్న నేతలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: మండలంలోని గూటుపల్లె గ్రామంలో పెద్ద రాజు స్వామి దర్గాలో జియారత్ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గాను దర్శించారు. వారికి దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి, సర్పంచ్ శ్రీరాములు, గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ఫాతేహాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రుడు, రుద్రవరం నారాయణ, మురళీధర్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి, దస్తగిరి, ఖాజా, వలీబాషా, సలీమ్, నాగేశ్వరరావు, తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త


మాట్లాడుతున్న నంద్యాల దిశ పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి

బేతంచెర్ల : మారుతున్న కాలనుగుణంగా సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల దిశ పోలీస్ స్టేషన్ సీఐ గౌతమి సూచించారు. శుక్రవారం పట్టణంలోని రీడ్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజేష్, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కేసీ తిరుపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమి మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో స్పందించాల్సిన నంబర్లు, ఈవ్‌టీజింగ్, శక్తి యాప్ వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులను సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తున్నారో వివరించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశలో సమయం విలువైనదని, చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు గానీ, ఇబ్బందికర పరిస్థితులు గానీ ఎదురైనా 100, 112, 1930 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. యువకులు గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని విద్యార్థులకు సూచించారు.

చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు


మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్ బాబు

బేతంచెర్ల: ఎస్పీ ఆదేశాల మేరకు ఈనెల 27 నుంచి జరగనున్న వినాయకచవితి ఉత్సవాల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్ఐ రమేష్ బాబు స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయా కాలనీల యువకులు డీజేలకు అనుమతి ఇవ్వాలని రాగానే, ఎస్ఐ వారితో మాట్లాడారు. డీజేలు పెట్టడం వల్ల గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సర ప్రవేశాలకు ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భారతి శుక్రవారం తెలిపారు. కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్, బీ.కాం కంప్యూటర్స్, బీ.కాం జనరల్, బీస్సీ కంప్యూటర్ సైన్స్, బీస్సీ మ్యాథమేటిక్స్, బీఎస్సీ బాటనీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాలలో అర్హత గల అధ్యాపకు లు, ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాల కోసం కళాశాలను సంప్రదించవచ్చన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: ఆల్వకొండ గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై ఎస్ఐ రమణయ్య శుక్రవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తులు గ్రామ శివారులో పేకాటాడుతున్న సమాచారం రావడంతో దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.4500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహితపై అత్యాచారయత్నం

నంద్యాల: రైలు దిగి ఇంటికి వెళ్తున్న మహిళపై ఆటోడ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి ఓ మహిళ తన పాపతో కలిసి గుంతకల్లు నుంచి నంద్యాల రైల్వే స్టేషన్‌కు వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో మాట్లాడుకుంది. వైఎస్సార్‌నగర్‌కు చెందిన సమరసింహం అనే ఆటో డ్రైవర్ బస్టాండ్‌కు తీసుకెళ్లకుండా మార్గమధ్యలో దారి మళ్లించి అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. అతని నుంచి తప్పించుకొని నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ


రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న సభ్యులు

కోవెలకుంట్ల: పట్టణంలో నెలకొల్పిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 40 మంది రోగులకు వాటిని అందజేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ద్వారా అంబులెన్స్, వైకుంఠ రథం, ఫ్రీజర్‌బాక్స్‌ను సమకూర్చడంతోపాటు పేదలకు పలు సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ నవీన్, సంస్థ అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, కార్యదర్శి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ

కోవెలకుంట్ల: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలో మండలంలోని కంపమల్ల మెట్ట సమీపంలో శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

ఎస్సీ మహిళా రైతులతో సమావేశం


మాట్లాడుతున్న డోన్ ఆర్డీఓ నరసింహులు

బనగానపల్లె రూరల్: మండలంలో 2016–17లో ఎస్సీ కులాల సేవా సహకార సంస్థ సహకారంతో భూకొనుగోలు పథకం కింద భూములు పొందిన ఎస్సీ మహిళా రైతులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ నరసింహులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంబులదిన్నె, తమ్మడపల్లి, ఇల్లూరుకొత్తపేట, కైప గ్రామాల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మొత్తం 30.50 ఎకరాల భూమిని 29 మంది ఎస్సీ మహిళా రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. అయితే అందులో కొంతమంది మహిళా రైతులు తమకు కేటాయించిన భూమి సాగుకు అనుకూలంగా లేదని, వాగులో ఇచ్చారని, వ్యవసాయానికి పనికిరావని ఫిర్యాదులు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారుల ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ సమావేశం నిర్వహిస్తున్నామని, వారి అభ్యంతరాలు, ఆధారాలు అర్జీల రూపంలో స్వీకరించి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసిదేవి, తహసీల్దార్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.